
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 14 జూన్ 2024

రక్తం ఇద్దాం..ప్రాణం పోద్దాం
● నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం
8లో..

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య
8లో..



గాడి తప్పిన బల్దియా పాలన

- పరారీలో జగిత్యాల మున్సిపల్ కమిషనర్
- రిమాండ్‌లో రెవెన్యూ అధికారి, రేపో, మాపో సస్పెన్షన్‌కు సిద్ధం
- ఇన్‌చార్జిలతోనే కొనసాగుతున్న పాలన

జగిత్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్‌లో పరిపాలన గాడి తప్పింది. మున్సిపల్‌లో కీలకమైన విభాగాలకు చెందిన అధికారులు వివిధ కేసుల్లో ఇరుక్కోవడం, సెలవుల్లో వెళ్లడం కారణంగా సేవలు అంతం తమాత్రంగానే అందుతున్నాయి. కేవలం ఇన్‌చార్జిలు, కింది స్థాయి ఉద్యోగులు మాత్రమే విధుల్లో ఉంటున్నారు. కీలకమైన అధికారులు అందుబా టులో లేకపోవడంతో నిత్యం బల్దియా కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చి వెళ్తుండే వారికి సేవలు అందడం గగనంగా తయారైంది. ప్రధానంగా మున్సిపల్ కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ విభాగం, సానిటేషన్ విభాగం, రెవెన్యూ విభాగం, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు పూర్తి స్థాయి అధికారులు ప్రసుత్తం అందుబాటులో లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. కొంతకాలంగా మున్సిపల్‌లో పలు పోస్టులు ఖాళీగా ఉండటం, ఇన్‌చార్జిలతో వెళ్లదీస్తుండడం సైతం ఇందుకు కారణంగా నిలుస్తోంది. జగిత్యాల మున్సిపల్‌కు వివిధ విభాగాల్లో 230 పోస్టులు మంజూరు కాగా కేవలం 84 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 146 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిపై పనిభారం ఎక్కువగా పడుతోంది. ఈ ప్రభావం వల్ల ప్రజలకు సరియైన విధంగా సేవలు అందడం లేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

భూ కుంభకోణంలో ఇరుక్కున్న మున్సిపల్ కమిషనర్...

మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి పెద్ద దిక్కుగా వ్యవహ రించ డంలో కీలకంగా వ్యవహరించే మున్సిపల్ కమిషనర్ ప్రస్తుతం సెల వులో ఉన్నాడు. ఓ భూ కుంభకోణం కేసులో ఇరుక్కున్న మున్సిపల్ కమి షనర్‌పై జగిత్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం కమిషనర్ పరారీలో ఉన్నాడని పోలీసులు వెల్లడి స్తున్నారు. ఇటీవల ఓ ప్రైవేటు స్థలా నికి నకిలీ సర్టిఫికెట్లు, ఫోర్జరీ సంతకాలతో మరొకరికి వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) ఇవ్వడం, సదరు స్థలంలో ఎటువంటి కట్టడం లేకున్నా ఇంటి నంబరు కేటాయించడంపై సంబంధిత యజమాని పోలీసులకు ఫి ర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులు మున్సిపల్ కమిషనర్ అనిల్, మున్సిపల్ రెవెన్యూ అధికారి ప్రసాద్ లతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. సమగ్ర విచారణ జరిపిన అనంతరం ఇటీవల రెవెన్యూ అ ధికారి ప్రసాద్, ఇతరులను అరెస్టు చేశారు. ఇదే కేసులో నిందితుడిగా ఉ న్న మున్సిపల్ కమిషనర్ అనిల్ పరారీలో ఉన్నట్లు పోలీసులు ప్రకటించా రు. ఈనేపథ్యంలో కొన్ని రోజులుగా మున్సిపల్ కమిషనర్ అనిల్ అధికారి కంగా సెలవు పెట్టి వెళ్లారు. మున్సి పల్ ఇన్‌చార్జి డీఈ యాదగిరికి తాత్కాలికంగా ఇన్‌చార్జి కమిషనర్ బాధ్యతలను అప్పగించారు. డీఈ యాదగిరి సైతం తన అనారోగ్య కారణాల వల్ల కమిషనర్ బాధ్యతలను నిర్వర్తించలేనని కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌లకు రాతపూర్వకంగా వినతిచేసినట్లు తెలుస్తోంది.

దీర్ఘ కాలిక సెలవులో మేనేజర్...

మున్సిపల్ పరిపాలనలో ప్రధాన బాధ్యతగా ఉండాల్సిన మేనేజర్ పోస్టు ప్రస్తుతం ఖాళీగా ఉంటోంది. ఇక్కడ పనిచేస్తున్న మున్సిపల్ మేనేజ ర్..దీర్ఘకాలంగా గైర్హాజరులో ఉండడం ఇందుకు కారణంగా నిలుస్తోంది. మున్సిపల్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న సాగర్ రెండు నెలలుగా సెల వుల్లో ఉంటున్నాడు. మున్సిపల్ రికార్డుల్లో మాత్రం దీర్ఘకాలికంగా గైర్హాజరవుతున్నట్లు నమోదు చేశారు. మున్సిపల్‌లోని అన్ని విభాగాలను పర్యవేక్షిస్తూ కమిషనర్‌కు చేదోడు వాదోడుగా ఉండాల్సిన మేనేజర్ విధుల్లో ఉండకపోవడంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

సెలవుల్లో టౌన్ ప్లానింగ్ అధికారి...

మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారిగా పని చేస్తున్న శ్రీనివాస్ ఇటీవల సెలవుల్లో వెళ్లారు. కొన్ని రోజులుగా మున్సిపల్‌లో చోటుచేసుకుంటున్న రాజకీయాలు, ఇతర వ్యవహారాల నేపథ్యంలో టీపీవో శ్రీనివాస్ సెలవుల్లో వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం టీపీఎస్ తేజస్విని విధులు నిర్వర్తిస్తున్నారు. మున్సిపల్‌లో ఒకటి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ పో స్టు, మూడు టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కింది స్థాయి సిబ్బందిచే పనులు చేయించుకుంటున్నారు. రోజురోజుకూ విస్తరిస్తున్న జిల్లా కేంద్రంలో నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. వీటిని అనుమతులు ఇవ్వడం, పర్యవే క్షణ చేయాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగంలో చోటుచేసుకున్న పరిస్థితులు అక్రమ నిర్మాణాలను అదుపు చేయడంలో విఫలమవుతున్నాయి.

ఇంజనీరింగ్ విభాగంలో ఇన్‌చార్జి డీఈ పాలన...

మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో ఇన్‌చార్జి డీఈ పాలన కొనసాగు తోంది. కరీంనగర్‌లో ఈఈగా పనిచేస్తున్న యాదగిరికి జగిత్యాల డీఈ బాధ్యతలు అప్పగించారు. మూడు రోజుల పాటు కరీంనగర్‌లో మూడు రోజుల పాటు జగిత్యాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీనికి తోడు ఇంజనీరింగ్ విభాగంలో ఒకటి అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టు ఖాళీగా ఉంది. దీనికి తోడు ఇటీవల ఇన్‌చార్జి డీఈ యాదగిరికి మున్సిపల్ కమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. పనిఒత్తిడి కారణంగా ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకోవడానికి డీఈ ప్రయత్నిస్తున్నారు. 14 వాటర్ వర్క్స్ లేబర్స్, ఒకటి వాటర్ వర్క్ క్లీనర్ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. మున్సిపల్‌కు 88 పబ్లిక్ హెల్త్ వర్కర్స్ పోస్టులు మంజూరు కాగా 44 పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి.

సానిటేషన్ విభాగంలోనూ అదే పరిస్థితి...

మున్సిపల్ కార్యాలయంలోని సాని టేషన్ విభాగంలో సైతం ఇన్‌చార్జి పాలన కొనసాగుతోంది. మున్సిపల్‌కు మూడు సానిటరీ ఇన్స్‌పెక్టర్ పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం ఒక్కరు మాత్రమే విధుల్లో ఉన్నారు. మరో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒకటి హెల్త్ అసిస్టెంట్ పోస్టు, మూడు సానిటరీ మేస్త్రీ పోస్టులు ఖాళీగా ఉంది. మున్సిపల్‌లో వినియోగిస్తున్న పలు చెత్త తరలించే వాహనాలు, ట్రాక్టర్లు, ఫాగింగ్ మిషన్ తదితర వాహనాలు మరమ్మతుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి అస్తవ్యస్తంగా తయారైన మున్సిపల్ అధికార పాలనను గాడినపెట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ విభాగం అస్తవ్యస్తం...

మున్సిపల్‌లోని రెవెన్యూ విభాగం అస్తవ్యస్తంగా తయారైంది. మున్సిపల్ రెవెన్యూ అధికారిగా వ్యవహరిస్తున్న ప్రసాద్ ఇటీవల ఓ స్థల వివాదం కేసులో ఇరుక్కొని జైలు పాలయ్యాడు. రేపో, మాపో ప్రసాద్‌ను సస్పెన్షన్ చేస్తూ సీడీఎంఏ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలు వడనున్నట్లు మున్సిపల్ వర్గాలు అంటున్నాయి. ఇన్‌చార్జి బాధ్యతలను ఇతరులకు ఉన్నతాధికారులు అప్పగించకపోవడంతో ఈ విభాగం ఆలనా పాలనా చూసే వారు కరువయ్యారు. మున్సిపల్‌కు ప్రధాన ఆదాయ వనరుగా ఉంటు న్న ఆస్తి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజు, ఇతర ఫీజులను ఈ విభాగానికి చెందిన ఉద్యోగులు వసూలు చేయాల్సి ఉంటుంది. ఏ రోజుకు ఆ రోజు లక్ష్యాన్ని నిర్ణయించుకొని వసూలు చేస్తేనే మున్సిపల్‌కు జనరల్ ఫండ్ జమ అవుతోంది. ఆ నిధులతో అవసరమైన అభివృద్ధి పనులు, సిబ్బంది వేతనాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను నిర్వర్తించే వీలుంటుంది. కీలకమైన విభాగం అస్తవ్యస్తంగా మారడం వల్ల ఇబ్బందులు చోటుచేసుకుంటున్నాయి.

ఇన్‌చార్జి బాధ్యతలతో ఇబ్బందులు: యాదగిరి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్, జగిత్యాల



జగిత్యాల మున్సిపల్‌లో పలువురు అధికారులు, ఉద్యోగులు సెలవుల్లో ఉండడం, దీర్ఘకాలికంగా గైర్హాజరవుతుండడం, ఇన్‌చార్జి అధికారులు బాధ్యతలు నిర్వర్తిస్తుండడంతో పాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కరీంనగర్‌లో ఇంజనీర్‌గా మూడు రోజుల పాటు వ్యవహరిస్తూనే జగిత్యాలలో మూడు రోజుల పాటు ఇంజనీర్ విధులు నిర్వర్తిస్తున్నాను. దీనికి తోడు ఇటీవల ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నాను. సాధ్యమైనంత మేరకు ఎటు వంటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నాము.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ

జగిత్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని 4వ వార్డులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాకు ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి గురువారం వినతిపత్రం అంద జేశారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల దేవీశ్రీ గార్డెన్ సమీపంలోని నాలుగవ వార్డులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. సంబంధిత నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నారా... లేదా...విచారించాలని కోరారు. ఒకవేళ అనుమతి ఉంటే అనుమతి ప్రకారం నిర్మాణం జరుగుతుందా...అక్రమ నిర్మాణం జరుగుతుందా గుర్తించాలని సూచించారు. అక్రమమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఏదీ ఏమైనా అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాత పరీక్ష లేకుండానే ఉద్యోగాలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా కన్వీనర్ సులోచన
- కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

జగిత్యాల టౌన్, జూన్ 13 : ఆశా కార్యకర్తలకు ఎలాంటి రాత పరీక్ష లేకుండానే ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలకు నష్టం కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష విధానాన్ని ప్రవేశ పెట్టే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సులోచన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. ఆశలకు టార్గెట్ ఇస్తూ పని ఒత్తిడి తీసుకవస్తూ మానసిక వేధనకు గురి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పని భారం తగ్గించే విధంగా జాబ్ చార్ట్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వేతనాలు ప్రతినెల మొదటి తేదీన ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ అధ్యక్షురాలు ఆత్మకూ రి లత, కార్యదర్శి మమత, జిల్లా కమిటి సభ్యురాళ్లు జీవ లక్ష్మి, జ్యోతి, వసంత, దివ్య, సరిత, రాణి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి నాయక్ ఉన్నారు.

బీఈడీ చేసిన వారికి అవకాశం ఇవ్వాలి



ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

జగిత్యాల టౌన్, జూన్ 13 : రాష్ట్రంలో పీఎస్ హెచ్ఎంల పదోన్నతుల్లో బీఈడీ చేసిన వారిని కూడా పరిగణలోకి తీసుకుని పదోన్నతుల విషయంలో అవకాశం కల్పించాలని కోరుతూ జగిత్యాల జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ స్పందించి మాట్లాడారు. అందరికి సమన్యాయం జరిగే విధంగా 65 వేల ప్రాథమిక ఉపాధ్యాయుల విశాల ప్రయోజనాల దృష్ట్యా సాంకేతిక పొరపాటును సరిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు సమస్యను సీఎం దృష్టికి తీసుకవెళుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు అమరనాథ్‌రెడ్డి, సురేష్, శంకర్, రమేష్, దేవయ్య, రాంరెడ్డి, ఆనంద రావు, రాజశేఖర్ ఉన్నారు.

అప్రమత్తతతోనే సీజనల్ వ్యాధుల నివారణ

ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి సమియోద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వైద్యాధికారి

జగిత్యాల టౌన్, జూన్ 13 : అప్రమత్తతతోనే సీజనల్ వ్యాధులను నివారించవచ్చునని ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి సమియోద్దీన్ అన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులను ఎదురుకునేందుకుగాను ఏర్పాటు చేసిన రాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులతో గురువారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఇంచార్జి వైద్యాధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య, ఆరోగ్య శాఖతో పాటు వివిధ శాఖలను కూడా రాపిడ్ రెస్పాన్స్ టీంలో చేర్చామన్నారు. పశు సంవర్ధక శాఖ అధికారులు బర్డ్ ఫ్లూ, రేబిస్ తదితర జంతు సంబంధిత వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఫుడ్ తనిఖీ అధికారులు ప్రభుత్వ, ప్రవేటు విద్యా సంస్థల్లో ఉన్న హాస్టళ్లతో పాటు హోటళ్లను తనిఖీ చేస్తూ ఆహార నాణ్యతను పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో సకల సౌకర్యాలతో పాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా కేంద్రంలో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించి కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఉన్న తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా టీ హబ్ అందించే సేవల్లో రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలువడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ సమావేశంలో వైద్యులు సౌజన్య, పూర్ణ చందర్, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనూష ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి



బావి మరమ్మతు పనులను పరిశీలిస్తున్న జీవన్ రెడ్డి

రాయికల్, జూన్ 13: తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామంలో మంచినీటి బావి మరమ్మతు పనుల కోసం నిధులు కేటాయించగా పనులు ప్రారంభమయ్యాయి. ఈ మరమ్మతు పనులను జీవన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. జీవన్‌రెడ్డి వెంట గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తెరుచుకోని రైల్వే గేట్లు

మల్యాల, జూన్ 13: మల్యాల రైల్వే స్టేషన్ సమీపంలో రామ న్నపేట వెళ్లే మార్గంలోని రైల్వే గేట్లు కాసేపు తెరచుకోక పోవడంతో ఇరు వైపుల వాహన దారులు అసౌకర్యానికి గురి అయ్యారు. గురువారం మధ్యాహ్నం ఓ రైలు వెళ్లడం కోసం అక్కడి సిబ్బంది గేటు వేశారు. రైలు వెళ్లాక గేట్లను తీయడానికి ప్రయత్నించగా దాదాపు అరగంట సేపు తెరచుకోలేదు. దీంతో రైల్వే సాంకేతిక సిబ్బంది వచ్చి మరమ్మతులు చేశాక గేట్లు తెరచుకున్నాయి. దీంతో వేచి ఉన్న ప్రయాణికులు, వాహనదారులు ఊసురుమంటూ వెళ్లిపోయారు.

ఎమ్మెల్సీని కలిసిన జగిత్యాల నేతలు

జగిత్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ వర్కింగ్ కమిటీ ప్రసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్‌ను గురువారం జగిత్యాలకు చెందిన పలువురు సీనియర్ న్యాయవాది, టీపీసీసీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గుంటి జగదీశ్వర్‌తో పాటు పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి అభినందించారు. జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ రాజకీయాలు వీరి మధ్య చర్చకు వచ్చాయి.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు : ఎస్సై

మెట్‌పల్లి, జూన్, 13 : ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి, ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. గురువారం కోరుట్ల నుంచి ఆర్మూర్‌కు అక్రమంగా తరలిస్తున్న మట్టి టిప్పారు పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో మెట్‌పల్లి మీదుగా మట్టి లోడుతో వెళ్తున్న టిప్పారును పట్టుకున్నారు. టిప్పర్ డ్రైవర్‌ను అనుమతి పత్రాలను చూపాలని కోరడంతో లేవని తెలపాడు. దీంతో అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనలతోనే మట్టి, ఇసుకను వాడుకోవాలని సూచించారు. తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా అధిక వాహనాలల్లో మట్టి, ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

రాయికల్, జూన్ 13: ఎక్సైజ్ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 13న మధ్యాహ్నం ఎక్సైజ్ అధికారులు పాత నేరస్తులను బైండోవర్ చేయడానికి మండలంలోని ధర్మాజీపేట గ్రామానికి వెళ్లగా గుగ్లావత్ చిరంజీవి అనే వ్యక్తి ఎక్సైజ్ అధికారులను దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో ఎక్సైజ్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలి

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేసిన ఎమ్మెల్యే

రాయికల్, జూన్ 13: పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, అప్పుడే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలో ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోటీని తట్టుకునే స్థాయిలో అంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరుగుతుందన్నారు. కరోనా కష్టకాలంలో సైతం మాజీ సీఎం కేసీఆర్ విద్య, పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారని అన్నారు. రూ. కోటి 31 లక్షలతో జిల్లా, మండల పరిషత్ పాఠశాలల మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేశామన్నారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ఎంపీపీ సంధ్యారాణిసురేందర్ నాయక్, జడ్పీటీసీ అశ్విని జాదవ్, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, జిల్లా అధికారి లక్ష్మీ నారాయణ, కౌన్సిలర్లు అనురాధరమేష్, తురగ శ్రీధర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సోహెల్, మహేందర్ బాబు, తహసీల్దార్ ఖయ్యూం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లహరి, ఎంఈవో గంగాధర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలి

మెట్‌పల్లి : విద్యార్థుల జీవితంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన విద్యతో పాటు క్రమశిక్షణ ప్రాముఖ్యతను తరగతి గదుల్లో బోధించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌ను అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో నిర్వహించే పేరెంట్స్ మీటింగులకు తల్లిదండ్రులు హాజరై తమ పిల్లల చదువు గురించి, పాఠశాలలోని వసతులను అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్య సించినప్పుడు మంచి జీవితం అనుభవిస్తారన్నారు. అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాలలో బోధనతో పాటు అన్ని రకాలైన మౌలిక వసుతులు ఉన్నయని, ఉచిత దుస్తువులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం వంటి సౌకర్యాలను ప్రభుత్వ కల్పిస్తుందన్నారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు మొగ్గు చూపకుండా ఎక్కువ ఫీజులు చెల్లించి ఇబ్బంది పడకుండా ప్రభుత్వ పాఠశాలలో పిల్లల్ని చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎమ్ఈవో భీమయ్య, అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే



కొడిమ్యాలలో నోట్ బుక్‌లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఎమ్మెల్యే

కొడిమ్యాల : దేవుడి తర్వాత విద్యార్థుల తలరాత మార్చే శక్తి ఉపాధ్యాయులకు ఉందని కలెక్టర్ యాస్మిన్‌బాషా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలను చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యంతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కలిపిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో బాగంగా జిల్లాలో 591 పాఠశాలలో 43.45 కోట్ల రూపాయలతో పనులను చేపట్టామన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉందన్నారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 2వేల కోట్ల రూపాయలతో ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో మదుసూధన్, డీఆర్‌డీవో సంపత్‌రావు, డీపీవో దేవరాజ్, డీఈవో జగన్‌మొహన్‌రెడ్డి, ఎంపీడీవో స్వరూప, తహసీ ల్దార్ రాజమణి, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీపీ స్వర్ణలత, సింగిల్ విండో చైర్మన్ రాజ నర్సింగరావు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఎంపీటీసీలు రాజేశ్వరీ రాజేందర్, లక్ష్మన్, మల్లారెడ్డి, జగన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నారాయణ గౌడ్, జీవన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఓపెన్‌స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాలు విడుదల

కరీంనగర్ టౌన్, జూన్ 13: తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ నిర్వహించిన పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలను విద్యాశాఖ గురువారం విడుదల చేసింది. కరీంనగర్‌లో పదోతరగతి పరీక్షకు 446 మంది విద్యార్థులు హాజరుకాగా 188 మంది ఉత్తీర్ణత సాధించారు. 42.15శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 297 మంది పరీక్షలు రాయగా 265 మంది 89.23శాతం ఉత్తీర్ణత సాధించారు. పెద్దపల్లి జిల్లాలో 383 మంది పరీక్షలకు హాజరుకాగా 130 మంది 33.94శాతం ఉత్తీర్ణత సాధించారు. జగిత్యాలలో అత్యధికంగా 606 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా అత్యల్పంగా 109 మంది కేవలం 17.99శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

● ఇంటర్మీడియట్‌లో జగిత్యాల జిల్లాలో 503 మంది పరీక్షలు రాయగా 188 మంది, 37.38శాతం ఉత్తీర్ణత సాధించారు. పెద్దపల్లి జిల్లాలో 719 మంది పరీక్షలు రాయగా 331 మంది 46.04శాతం, కరీంనగర్‌లో 822 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరు కాగా వారిలో 480 మంది 58.39శాతం ఉత్తీర్ణత సాధించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 553 మంది పరీక్షలు రాయగా 402 మంది, 72.69శాతం ఉత్తీర్ణుల య్యారు. ఈమేరకు 2023-24 లో నిర్వహించిన పరీక్షలకు హాజరైన వారిలో ఉత్తీర్ణులైన వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌విఎస్ జనార్ధన్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూ ల్ కో ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో విడుదల చేశారు.

కొనసాగుతున్న విద్యా సంస్థల వాహనాల తనిఖీలు

తిమ్మాపూర్, జూన్ 13: విద్యా సంస్థలు ప్రారంభం కావడంతో రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ముఖ్యంగా విద్యా సంస్థల వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన తనిఖీలలో మొత్తం 24 వాహణాలను సీజ్ చేసినట్లు డీటీపీ పురుషోత్తం తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని విద్యా సంస్థల బస్సులు 2, ఫిట్‌నెస్, టాక్స్ లేకుండా నడుపుతున్న విద్యా సంస్థల బస్సులు 3, పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న విద్యా సంస్థల బస్సులు 4, పన్నులు చెల్లించని గూడ్స్ క్యారెజ్ వాహనాలు 6, ఫిట్‌నె స్ లేని గూడ్స్ క్యారెజ్ వాహనాలు 1, ట్రాక్టర్ ట్రాలీకి ట్యాక్స్ చెల్లించకుండా నడుపుతున్న ఒక వాహనాన్ని పట్టుకున్నాట్లు , పట్టుకున్న వాహనాలను సీజ్ చేసి జిల్లా రవాణా కార్యాల యానికి తరలించినట్లు డీటీసీ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ప్రమ మాదాలు చోటు చేసుకోకుండా అధికారులకు సహకరించాలని ఆయన తెలిపారు. వాహనాల తనిఖీల్లో ఎంవీఐ టి రవికుమార్, ఏఎంవీఐ స్రవంతి, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన వ్యక్తి రిమాండ్

వేములవాడ టౌన్, జూన్ 13: ఒకే భూమిని ఇద్దరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి సరిహద్దులు చూపకుండా మోసాలకు పాల్పడుతున్న సిరిగిరి రమేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గురువారం తెలిపారు. సిరిసిల్ల అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి రమేష్ అనే వ్యక్తి 20 సంవత్సరాల క్రితం తిప్పాపూర్ శివారులోని సర్వే నంబర్ 138, 139, 141, 142లో గల 200 గజాల భూమిని శాభాష్‌పల్లి గ్రామానికి చెందిన లెంకల రాజుకు రిజిస్ట్రేషన్ చేసి సరిహద్దులు సరిగా చూపెట్టకుండా ఇబ్బందులకు గురిచేశాడు. అంతే కాకుండా మరల అదే భూమిని సందవేణి ఎల్లవ్వకు గిప్ట్ డీడ్‌తో రిజిస్ట్రేషన్ చేయించి ఆమెను బెదిరించి సదరు మహిళ వద్ద లక్ష రూపాయలు తీసుకున్నాడు. సరైన హద్దులు చూపించకుండా మోసం చేయగా సందవేణి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

చేదబావిలో పడిన వృద్ధురాలు

- కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



భాగ్యమ్మను బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చొప్పదండి, జూన్ 13: చొప్పదండి పట్టణంలోని జ్యోతినగర్‌లో గురువారం చేదబావిలో వృద్ధురాలు పడిపోగా అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. పెంబాల భాగ్యమ్మ (60) గురువారం ఉద యం ఇంటి సమీ పంలో ఉన్న చేదబా విలో ప్రమాదవశాత్తు పడిపోయింది. కుటుంబ సభ్యులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది తాళ్లసా యంతో బావిలోకి దిగి వృద్ధురా లిని పైకి తీసుకువచ్చారు. భాగ్యమ్మ స్వల్ప గాయాలతో బయట పడింది. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది జి రవీందర్, కె శ్రావణ్‌కుమార్, కె సతీష్, వి గంగేశ్ పాల్గొన్నారు.

నర్సింహస్వామి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

కొడిమ్యాల, జూన్ 13 : మండలంలోని నల్లగొండ గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి హుండీ లెక్కింపును గురువారం అధికారులు, సిబ్బంది నిర్వహించారు. స్వామివారి హుండీలో 4లక్షల 66వేల 35 రూపాయల నగదు భక్తుల నుండి సమకూరినట్లు ఆలయ ఈవో వెంకన్న తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ చైర్మన్ సత్యనారాయణరావు, దేవాదాయ పరిశీలకులు సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ కమలాకర్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీకుమారా చార్యులు, మనోజ్‌కుమారాచార్యులు, కార్యాలయ సిబ్బంది, మహేందర్, కొమురయ్య, రమేష్, సత్యసాయి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్య బలోపేతానికి 'పీసెట్' దోహదం

- శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ మల్లేష్



మాట్లాడుతున్న శాతవాహన మాజీ వీసీ మల్లేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్13: వ్యాయామ విద్య బలోపేతానికి పీసెట్ నిర్వహణ ఎంతగానో దోహదపడుతుందని శాతవాహన యూనివర్సిటీ మాజీ ఉపకులపతి మల్లేష్ అన్నారు. తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ శారీరక పరీక్షలు గురువారం శాతవాహన యూనివర్సిటీ మైదానంలో ముగిశాయి. మహిళ అభ్యర్థులకు నిర్వహించిన శారీరక సామర్థ్య పరీక్షలను ఆయన జెండా ఊపి మాట్లాడారు. రెండు పర్యాయాలు పీసెట్ నిర్వహణ బాధ్యతలను శాతవాహన యూనివర్సిటీ నిర్వహించ డంతో న్యాక్ గ్రేడ్‌కు అర్హత సాధించే అవకాశం ఉందన్నారు. పాలమూరు విశ్వవిద్యా లయం మాజీ ఉపకులపతి ఆచార్య లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యత ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లపైనే ఉంటుంద న్నారు. చివరి రోజు మొత్తం 345మంది మహిళ అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో 253మంది బీపీఈడీ అభ్యర్థులు కాగా 102మంది డీపీఈడీ అభ్యర్థులు. వీరికి 100మీటర్లు, 400మీటర్లు షాట్‌పుట్ ,హైజంప్, లాంగ్‌జంప్‌లతో పాటు 8క్రీడా అంశాలలో నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, టీజీ పీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ విభాగం డైరెక్టర్ ఆచార్య జెప్రభాకర్ రావు, శాతవాహన విశ్వవిద్యాలయం స్పోర్ట్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నజీముద్దీన్ మునవర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, బాలరాజు, శ్రీధర్ రావు, నాగేశ్వర్‌రావు, పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, గద్దె సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బోర్డు పైన పడి
పారిశుధ్య కార్మికుడి మృతి

ధర్మారం, జూన్ 13: ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలో గల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఎల్సారి సత్తయ్య(50) అనే పారిశుధ్య కార్మికుడు గురువారం చదును చేస్తున్న క్రమంలో పైన గల బోర్డు ప్రమాదవశాత్తు పడడంతో మృతి చెందాడు. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల వాటర్ ట్యాంక్ కింది భాగం ఆవరణలో గల చెత్తాచెదారాన్ని గ్రామ పంచాయతీ కార్మికుడు సత్తయ్య తొలగిస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంక్ యొక్క వాటర్ లెవల్ చూపే బోర్డు పై నుంచి సత్తయ్యపై పడింది. ఈ ప్రమాదంలో అతని ఎడమ భుజం వెనుక తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సత్తయ్య భార్య శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కార్మికులు కోరారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఇల్లంతకుంట, జూన్ 13: మండలంలోని నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త శ్రీనివాస్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజుగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని రేపాక గ్రామానికి చెందిన దళిత యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు..

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేములవాడ టౌన్, జూన్ 13: వేములవాడ మండలం చంద్రగిరి గ్రామంలో గురువారం తెల్లవారు జామున నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రగిరి గ్రామానికి చెందిన జవ్వాజి ఎల్లయ్య (55) అనే వ్యక్తి గురువారం తెల్లవారు జామున సిరిసిల్ల-వేములవాడ ప్రధాన రహదారి పక్కన నడుచుకుంటు వెళుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రగాయాలైన ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఎల్లయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

- 34 మందిపై కేసు



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

కరీంనగర్ క్రైం, జూన్ 13: అక్రమంగా ఇసుక ను తరలిస్తున్న సమాచారం మేరకు గురువారం కరీంనగర్ రూరల్ పోలీస్ సబ్ డివిజన్ పోలీసులు దాడులు నిర్వహించి 34 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. కరీంనగర్ శివారులోని అలుగునూర్, తిమ్మాపూర్ మండలం రేణికుంటల వద్ద పోలీసులు నిర్వహిచి ప్రత్యేక తనిఖీలలో ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని మానకొండూర్, ఎల్ఎండీ పోలీసు ఠాణాలకు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానులపై కేసులు నమోదు చేశామని రూరల్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు. ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు గోనెల సంపత్, బొంగోని రాజు, ఇరుగదిండ్ల సమ్మరాజు, సారయ్య, బోయిని అనిల్‌రాజు, పల్లపు ఎల్లయ్య, మార్క అభిషేక్, జితెందర్, వెంకటస్వామి, రాజేశ్వరి, అజయ్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, రమేశ్, సంపత్, ప్రణయ్‌వంశీ, అనిల్, అంజయ్య, రాజు, వెంకటేష్, రాజశేఖర్, హరితేజ, ఎల్లయ్య, గణేష్, అనిల్, కుమార్, రమేష్, రవి, ఎండీ అజీమ్, రమేశ్, రాజశేఖర్, జంపయ్యలపై ఐపీసీ సెక్షన్ 379, 21(4) మైన్స్ అండ్ మినరల్స్ యాక్టుతో పాటు మరిన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఏసీపీ వెంకటరమణ తెలిపారు.

● తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట గ్రామ సమీపంలోని మోయతుమ్మెద వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను గురువారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి వాటిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు



మాట్లాడుతున్న టౌన్ ఏసీపీ నరేందర్

కరీంనగర్ క్రైం, జూన్ 13: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని టౌన్ ఏసీపీ నరేందర్ అన్నారు. నగరంలో గురువారం వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకొని 40 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపారు. పట్టుబడిన వాహనాలను ట్రాఫిక్ ఠాణాకు తరలించామన్నారు. మైనర్లకు వాహనాలిస్తే సంబంధిత వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని కరీంనగర్ టౌన్ ఏసీపీ హెచ్చరించారు. కరీంనగర్‌లో బుధవారం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులకు గురువారం టౌన్ ఏసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలకు వాహన యజమానులు, తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు ఖరీముల్లా ఖాన్, స్వామి, ఎస్ఐలు ఇషాక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ధర్మపురి, జూన్ 13: దమ్మన్నపేట గ్రామంలో గురువారం విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి చెందింది. గురువారం ఉదయం రైతు మడిపల్లి తిరుపతి తన గేదెను మేపడం కోసం సమీపంలో గల గోదావరి నది వద్దకు తీసుక వెళ్లాడు. గేదె గడ్డి మేస్తుండగా పొలం కోసం అమర్చిన విద్యుత్ మోటార్ వైరు తాకి షాక్ తగిలి మృతి చెందింది. గేదె విలువ రూ 70,000 విలువ ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు తిరుపతి కోరారు.

గుండెపోటుతో కూలీ మృతి

ఇల్లంతకుంట, జూన్ 13: మండలంలోని పొత్తూర్ గ్రామసమీపంలోని మానేరువాగులో కూలీపనికి వెళ్లిన చెక్కిళ్ళ శ్రీనివాస్ (50) గురువారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో రెండు చుక్కల దుప్పుల మృతి



దుప్పులకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వీర్నపల్లి, జూన్ 13: వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో కుక్కల దాడిలో రెండు చుక్కల దుప్పులు మృతి చెందాయి. గ్రామ శివారులోని పల్లె ప్రకృతి వనం సమీపంలో ఉండే అటవీ ప్రాంతం నుంచి తాగునీటి దాహార్తి తీర్చుకొనేందుకు రెండు చుక్కల దుప్పులు వచ్చాయి. దుప్పుల రాకను గుర్తించిన కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. గాయపడిన దుప్పులను గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించటంతో వాటిని స్వాధీనం చేసుకొని వైద్యం కోసం అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లారు. పశు వైద్యాధికారులు చికిత్స అందించినప్పటికీ కోలుకోలేక రెండు దుప్పులు మృతి చెందాయి. దాంతో అటవీ సెక్షన్ అధికారికి పద్మలత ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేయించి అటవీ ప్రాంతంలో కాల్చివేశారు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



రాజు(ఫైల్)

వీర్నపల్లి, జూన్ 13: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవి పదిర గ్రామానికి చెందిన వేముల రాజు(40) బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా బుధవారం రాత్రి కోనరావుపేట గ్రామశివారులో ద్విచక్ర వాహనంతో చెట్టును బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్సులో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

మానకొండూర్, జూన్ 13: మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన బండి అశోక్‌కు చెందిన ఆవు గురువారం పిడుగుపాటుతో మృతి చెందింది. గ్రామంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగుపడి ఆవు మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

96 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ఐతరాజ్‌పల్లిలో పట్టుబడిన రేషన్ బియ్యం

సుల్తానాబాద్, జూన్ 13: జిల్లాలో గురువారం పౌర సరఫరాల శాఖ టాస్క్ ఫోర్స్ బృందం నిర్వహించిన తనిఖీలలో 96 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యం నిల్వలు పటుకున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లి రేషన్ దుకాణాలను, ఐతరాజుపల్లి ఓపెన్ ఏరియా పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామంలోని రేషన్ షాపు తనిఖీచేసినప్పుడు 52.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఎక్కువగా రేషన్ షాప్ నిల్వలలో గుర్తించామని అన్నారు. అదేవిధంగా సుల్తానాబాద్ మండలం ఐతారాజుపల్లి వద్ద ఓపెన్ ఏరియాలో 43.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం వారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని డీసీఎస్‌వో హెచ్చరించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా గుంత

- మరమ్మతులు చేయని అధికారులు
- రాకపోకలకు ప్రజల అవస్థలు



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

మల్లాపూర్, జూన్ 13: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంత ప్రమాదకరంగా మారింది. మిషన్ భగీరథ నీటి సరఫరాలో లీకేజీ కావడంతో సంబంధిత అధికారులు పైపు మరమ్మతుల కోసం పది రోజుల క్రితం గుంత తవ్వారు. పనులు పూర్తి చేసుకున్నాక గుంతను మాత్రం అలానే ఉంచి వెళ్లారు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరనే ఆరోపణలు వేలువెత్తున్నా యి. అదే గుంతలో గ్రామానికి చెందిన బింగి మనస్విత్ అను బాలుడు గురువారం ప్రమాదవశాత్తు పడ్డాడు. దీంతో బాలుడి తలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రతి నిత్యం ఆ రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్లే బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రిల్లో ఆ రోడ్డుపై తెలియని వారు వేళితే ఏలాంటి ప్రమాదం జ రుగుతుందోనని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ అధికారులు స్పదించి గుంతను పుడ్చాల్సిన అవసరం ఉదని కాలనీ వాసులు వాపోతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ



మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి, జూన్, 13 : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన పనులు వివారులు, ఆసుపత్రిలోని వార్డులు పరిశీలించి రోగుల ఆరోగ్య పరిస్థితి, వైద్యులు అందిస్తున్న సేవలు, వైద్యుల హాజరు పట్టికను పరిశీలించి పనితీరు గురించి, వసతులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నిలిపివేశారని సిబ్బంది తెలుపగా సదరు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసిన పనులను త్వరగా పూర్తి చేయా లని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులతో దురుసుగా ప్రవర్తించకుండా వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. నర్సులు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సిబ్బంది ఆసుపత్రిలోని రోగులకు అందుబాలో ఉండాలని, ఎప్పటికప్పుడు మందుల నిల్వ ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రిలో ఎలాంటి సమస్యలున్న వాటిని తక్షణ మే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఈయన వెంటా నాయ కులు, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మెట్‌పల్లి, జూన్, 13 : ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు సూచించారు. గురువా రం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో మెట్‌పల్లి, కోరుట్ల పరిధిలోని ము స్లిం మత పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. బక్రీద్ పండుగ నిర్వహ ణపై ముస్లిం మత పెద్దల సహాలు, సూచనలు తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మతాలను గౌరవించుకుంటూ పండుగలను ని ర్వహించుకోవాలని, శాంతియుతంగా ఆనందోత్సాహలతో జరుపుకొని మత సామరస్యానికి పాటు పడాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో మత ఘర్షణలను ప్రేరేపించే వార్తలు వస్తే నమ్మవొద్దన్నారు. ఏమైనా చట్ట వ్యతిరేక సంఘటనలు జరిగితే పోలీసులకు గాని డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మెట్‌పల్లి, కోరుట్ల సీఐలు నవీన్, సురేష్‌బా బు, అధికారులు, సిబ్బంది, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి బోనాలు



పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి, జూన్ 13: మండలంలోని పోరుమల్ల గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి బోనాల పండుగకు వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు ని ర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి పల్లెలు పాడి పంటలతో పచ్చగా ఉండాలని వేడుకున్నారు.

అనంతరం మేడిపల్లి మాజీ ఎంపీపీ దోనకంటి వే ణుగోపాల్‌రావుని పరామర్శించారు. అనంతరం కాచారం గ్రామంలో ప్రమాదంలో మృతి చెందిన చిట్యాల సాగర్ కుటుంబాన్ని పరామర్శించారు. అ యన వెంట సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కుంట నారాయణరెడ్డి, తోకల రవి,రాజేందర్‌రెడ్డి, నాగరాజు, ప్రణయ్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తం ఇద్దాం..ప్రాణం పోద్దాం

● ఆపద సమయంలో అండగా నిలుస్తున్న రక్తదాతలు ● జగిత్యాలలో ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు

● నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

జగిత్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏ వస్తువునైనా మనిషి తన తెలివి తేటలతో తయారు చేయగలడు... డబ్బుతో వాటిని కొనుగోలు చేయగలడు...కానీ మనిషి రక్తాన్ని కృత్రిమంగా సృష్టించడమూ సాధ్యం కాదు. వెల కట్టలేని రక్తాన్ని కేవలం మరో వ్యక్తి నుంచే సేకరించాలి. అందుకే రక్తదా నానికి అంతటి ప్రాధాన్యం ఏర్పడింది. అంతటి విలువైన జాగ్రత్తగా కాపాడుకోవడంతో పాటు...విరివిగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి. అయితే ఇటీవల కాలంలో రక్తం అవసరమైనవారు సోషల్ మీడియా లోనూ ప్రచారం చేసుకుంటుండగా... అలాంటి వారి కోసం ఎంతో మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 14వ తేదీన ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

● అరుదైన రక్త గ్రూపులు...

రక్తంలో ఏ, బీ , ఏబీ, ఓ పాజిటివ్, ఓ నెగిటివ్ గ్రూపులు ఉంటాయి. వీటిలో పాజిటివ్ గ్రూపులు ఎక్కువగా లభిస్తాయి. నెగిటివ్ గ్రూపులు చాలా అరుదుగా ఉంటాయి. ప్రైవేటు బ్లడ్ బ్యాంకులలో రక్తం తీసుకునే ముందు హెచ్‌బీ శాతం, హెచ్ఐవీ పరీక్షల రిపోర్టు, కాస్ మాచింగ్ రిపోర్టు ఉందో లేదో సరి చూసుకోవాల్సి ఉంటుంది.

● ఇవి తెలుసుకోండి...

ఆరోగ్యవంతులైన వారు ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేయ డానికి అవకాశం ఉంది. ఒక వ్యక్తి శరీరంలో దాదాపు పది యూనిట్ల రక్తం ఉంటుంది. రక్తదానం సందర్భంగా ఒక యూనిట్ దానం చేస్తారు. రక్తంలోని ఎర్ర రక్తకణాలని అయితే రెండు నెలలకోమారు దానం చేయవచ్చును. ఆరోగ్యవంతులైన 18-60 ఏళ్ల మధ్య వయసు గలవారు రక్తదానం చేయడానికి అవకాశం ఉంది. రక్తదానం చేసే ప్రతి ఒక్కరు 45 కిలోల బరువు ఉండాలి. అంతకంటే తక్కువ బరువు గల వారు రక్తదానం చేయకపోవడం మంచిదని వైద్యులు అంటున్నారు. రక్తదానం చేసే వ్యక్తి శరీర ఉష్ణోగ్రత బీపీ పల్స్ రేట్ వంటివి సాధారణ స్థాయిలో ఉండాల్సి ఉంటుంది. రక్తంలో హిమోగ్లోబిన్ కనీసం 12.5 గ్రాములకు తక్కువ కాకుండా చూడాల్సి ఉంది.



రక్తదానం చేస్తున్న యువకులు

● రక్తదానం ఎవరు చేయరాదు..

మామూలుగా రక్తదానం శ్వాసకోశ వ్యాధులున్న వారు, కాన్సర్, గుండె జబ్బులు, ఉన్నట్టుండి బరువు తగ్గడం, డయాబెటిక్, హైపటైటిస్, అస్తమా, ఎపిలెప్సీ, కాలేయవ్యాధులు, ఎండోక్రైన్ సమస్యలు, ఎయిడ్స్ లక్షణాలు కలిగిన వారు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు రక్తదానం చేయరాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు చికిత్స పొందిన వారు, శస్త్ర చికిత్స చేయించుకున్నవారు, రక్తదానం పొందిన వారు కనీసం ఏడాది వరకు రక్తదానం చేయడానికి వీలు లేదన్న అభిప్రాయాలున్నాయి.

● ముగ్గురి ప్రాణం నిలపొచ్చు..

ఒక వ్యక్తి దానం చేసే రక్తం..ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తం ఇవ్వగానే దాన్ని వివిధ కాంపో నెంట్లుగా విభజిస్తారు. దాత నుంచి సేకరించే రక్తం (హోల్ బ్లడ్)లో ప్లాస్మా, ప్లేట్లెట్స్, తెల్లరక్తకణాలు, ఎర్ర రక్త కణాలు ఉంటాయి. అప్పుడు ఒక్కరి రక్తమే కనీసం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుంది. రక్తదానం చేస్తే కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

రక్తం కొరత లేకుండా చూస్తున్నాము

డాక్టర్ సమీయోద్దిన్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, జగిత్యాల



జిల్లాలో రక్తం కొరత లేకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసు కుంటున్నాము. డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తు న్నాము. జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేశాము. రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము.

రక్తదానంపై అపోహలు వీడాలి

డాక్టర్ శ్రీనివాస్, బ్లడ్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో



చాలా మందికి రక్తదానం అంటే భయం, అపోహలు న్నాయి. వాస్తవానికి రక్తదానం ప్రక్రియలో కేవలం 300 మిల్లీ లీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు. సాధారణంగా మనిషిలో సరాసరి 5 లీటర్ల నుంచి 6 లీటర్ల రక్తం ఉంటుంది. అందులో 300 మి.లీ. దానం చేయడం వల్ల ఎటువంటి ప్రమాదం జరగదు. వీటన్నంటిపైనా అవగాహన కలిగి ఉంటే చాలా వరకు అపోహలు తొలిగిపోతాయి.

21 సార్లు రక్తదానం చేశాను

చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, రక్తదాత, జగిత్యాల జిల్లా



నాబ్లడ్ గ్రూప్ ఓ నెగిటివ్...ప్రత్యేక గ్రూపు రక్తాన్ని కలిగియుండడం అదృష్టంగా బావిస్తున్నాను. ఇప్పటివరకు సుమారుగా 21 సారు రక్తదానం చేశాను. రక్తదానం చేసి అత్యంత ఆనందం, సంతృప్తి పొందుతున్నాను. పలువురు ఆపదలో ఉన్న రోగులకు అత్యవసర సమయాల్లో రక్తదానం చేయడం ఆనందాన్ని కలిగించింది.

ఓ పర్యాయం కేవలం రక్తదానం చేయడానికి ప్రత్యేకంగా వాహనంలో హైద్రాబాద్ వెళ్లి వచ్చాను.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో క్యాంపులు

మంచాల కృష్ణ, రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి, జగిత్యాల



ప్రతీ నెల రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన క్యాంపులను నిర్వహిస్తున్నాము. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయా సందర్భాల్లో నిర్వహిస్తున్న క్యాంపులకు దాతల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

ఈ యేడాది సైతం నిర్ణీత లక్ష్యం మేరకు రక్తం సేకరించేందుకు ప్రణాళిక రూపొందించాము.

ఘనంగా పోచమ్మ, పెద్దమ్మ తల్లి బోనాల జాతర

జగిత్యాల టౌన్, జూన్ 13 : పోచమ్మ, పెద్దమ్మ తల్లులు చల్లంగా చూడాలమ్మా అంటూ బోనాల జాతర పండుగను భక్తులు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని మంచినీళ్ల బావి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి, నూకపెల్లి కేసీఆర్ కాలని వాసులు పోచమ్మ తల్లి బోనాల జాతర పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని డీజే పాటలు, డప్పు చప్పుల్లతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ఊరేగింపులో పాల్గొని నెత్తిన బోనం ఎత్తుకుని తమ భక్తి భావం చాటుకున్నారు. అనంతరం మహిళలు స్థానిక పోచమ్మ, పెద్దమ్మ తల్లి ఆలయాల్లో బోనాలు సమర్పించి సంవృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మురిరాజ్ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ, లక్ష్మి దేవతలకు బోనాలు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతన వస్త్రాలు ధరించిన మహిళలు నెత్తి మీద బోనాలు పెట్టుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆల యాలకు వెళ్లారు. అనంతరం మహిళలు, రైతులు ఆలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. మహిళలు అమ్మవారలకు బోనాలు పెట్టి నైవేద్యం సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు, న్యాయవాది జాజాల రమేష్, మాజీ ఉపసర్పంచ్ జాజాల శంకర్, ఉపా ధ్యక్షులు పాదం చంద్రయ్య, జంగిలి తిరుపతి, కరవత్తుల నాగరాజు, జాజాల రవి, చీపిరిశెట్టి శంకర్, పాదం శంకర్, మీనయ్య, రాజన్న పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం(మాల) ఆధ్వర్యంలో గురువారం పెద్దమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు. సంఘం అధ్యక్షుడు మండల ప్రవీణ్, ఉపాధ్యక్షుడు కొమ్ము ప్రశాంత్, సంఘం సభ్యులు నరేష్, శేఖర్, అజయ్, సాయి, మహేష్, గంగరాజం, రాజేందర్, నిరంజన్, దివాకర్, బాలయ్య పాల్గొన్నారు.



నెత్తిన బోనంతో వెళ్తున్న బోగ శ్రావణి, మహిళలు

● మండలంలోని ఆలూరు గ్రామంలో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రావు, మెక్కొండ రాంరెడ్డి, లాల్‌చావ్లా రాజన్న యాదవ్, సురేందర్ రెడ్డి, రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రాయికల్ పట్టణంలో ట్రాక్టర్స్ ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నల్ల పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎనుగంటి రాజు, ఉపాధ్యక్షుడు మధు, క్యాషియర్ అర్జున్, సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ధర్మపురి, జూన్ 13: ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాలలో హిందీ, గణితం ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ముత్యం బుచ్చన్న ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ ఉపాధ్యాయ పోస్టుకు డిగ్రీతో పాటు హెచ్‌పీటీ, గణిత ఉపాధ్యాయ పోస్టుకు పీజీతో పాటు బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలని ఆయన పేర్కొన్నారు.

అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు అంద రు ఈ నెల 18వ తేదీ లోపుగా మగ్గిడి ఆదర్శ పాఠ శాల లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 19న ఆదర్శ పాఠశాలలో డెమో ఉంటుందని ఆయన తెలిపారు.

ఎంపికైన అభ్యర్థు లకు నెలకు గౌరవ వేతనం రూ 18,200 ఉం టుందని ఆయన వివరించారు. మిగతా వివరాల కోసం మొబైల్ నెంబర్ 9949015156 సంప్రదించాలని ఆయన కోరారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

● ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ

కథలాపూర్, జూన్ 13 : వ్యవసాయం, పరిశ్రమలు, గృహాలకు నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సత్యనా రాయణ సూచించారు. మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మే నెలలో విద్యుత్ అంత రాయాలు అధికంగా ఉన్న విషయం తెలుసుకుని కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎయిర్ బ్రేక్ స్విచ్‌లు, లూస్ లైన్లు ఉన్న చోట మధ్య స్తంభాలు ఏర్పాటు చేసి అంతరాయాలు కలగకుండా చూడాలని సూచించారు. ఎక్కడైతే విద్యుత్ వైర్లకు చెట్లు అడ్డుగా ఉన్నాయో గమనించి ఆ చెట్లను కొట్టివేసి వర్షాకాలంలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా చూసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఏఈ జమీల్‌పాషా, డీఈఈ తిరుపతి, ఇన్‌చార్జ్ ఏడీఈ ఆంజనేయరావు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి చిన్నారి విరాళం

రాయికల్, జూన్ 13: మండలంలోని అల్లీపూర్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన బడిబాట కార్యక్రమంలో దండెవేణి నరేష్ కూతురు 8వ తరగతి చదువుతున్న చైత్ర పాఠశాల అభివృద్ధి కోసం తన వంతు సహాయంగా రూ.2 వేల విరాళం అందజేసింది. ఇంత చిన్న వయస్సులో తాను చదువుతున్న పాఠశాల అభివృద్ధి చెందాలని ఆలోచించి దాచుకున్న డబ్బులు ఇవ్వడం అభినందనీయమన్నారు. చిన్నారిని ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్, అధ్యాపకులు, వేముల సతీష్, భూమయ్య, ఇబ్రహీం అభినందించారు.

సంక్షిప్త సమాచారం

మల్లాపూర్ : మండలంలోని మొగిలిపేట గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గురువారం ఆలయంలోని అమ్మ వారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గ్రామంలోని భక్తులు భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేసిన బోనంను నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

భీమారం: భీమారం మండల కేంద్రానికి చెందిన నల్ల రమేష్ ఇటీవల మృతి చెందగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం వారి కుటుంబస భ్యులను పరామర్శించారు. అనంతరం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

మల్యాల: మండలంలోని బల్వంతాపూర్‌లో చేపట్టిన రహదారి పనుల్లో భాగంగా మురుగుకాలువల నిర్మాణం నిలిచిపోవడంతో జిల్లా పంచాయితీ అధికారి దేవరాజ్ పరశీలించారు. ఓ ఇంటి యజమాని తన ఇంటికి నష్టం జరుగుతందని డ్రైనేజి పనులను నిలిపివేయడంతో దాదాపుగా ఇరవై మీటర్ల మేర పనులు ఆగిపోయాయి. దీంతో పలువురు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీ పనులు పూర్తికాక రహదారి పనులకు ఆటంకం ఏర్పడుతుందని తెలుపడంతో కలెక్టర్ ఆదేశాలతో డీపీవో గ్రామాన్ని సందర్శించారు. ఇంటి యజమానితో మాట్లాడా రు. డీపీవో వెంట ఎంపీడీవో స్వాతి, పంచాయితీ కార్యదర్శి తదితరులు ఉన్నారు

కోరుట్ల : మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోరుట్ల పట్టణ చెందిన అంగన్ వాడి టీచర్లు ఏఐటీయుసీ సభ్యత్వంకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పట్టణంలోని సీనారే కళాభవనంలో గురువారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏఐటీయుసీ యూనియన్ నాయకులు ఇష్టారాజ్యంగా ఏకగ్రీవంగా తీర్మాణాలు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడి టీచర్లు హి మగిరి, మంజుల, పద్మ, ఇందిరా, స్వప్న, లక్ష్మీ, సుజాత, రాజమణి, పుష్పలతలతో పాటు పలువురు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల ఒర్రెగడ్డ ప్రాంతంలో గల జగ్గని ఒర్రె అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఎంపీపీ ఆగంతపు రవళివంశీధర్ కోరారు. జగ్గని ఒర్రెతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అనేక ఏళ్లుగా ఒర్రె అభివృద్ధికి నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని తగు చర్యలు తీసుకొని స్థానికులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. జిల్లా కలెక్టర్‌ను చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సత్యం కోరారు

కోరుట్ల : ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆర్ భూమయ్య కుటుంబను గురువారం కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావు పరమర్శించారు. ఆర్. భూమయ్య కుమారుడు వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదం మృతి చెందంగా అయన కుటుంబాన్ని పరమర్శించారు.

కొడిమ్యాల : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బలమైన గాలి వీయటంతో మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన గోరెటీ ఇంటిపై నుండి రేకులు లేచిపోయాయి. దీంతో ఇంటిలోని వస్తువులు తడిచిపోయాయి. ప్రజలు ఉక్కపోత నుండి ఉప శమనం పొందారు.

● మండలంలోని సంద్రల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు ఏనుగు ఆదిరెడ్డి ప్రభుత్వం నుండి వచ్చిన ఉచిత దుస్తులను, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠశాలలో ప్రభుత్వం కలిపిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపాలన్నారు.

ధర్మపురి: మండలంలోని జైనా గ్రామానికి చెందిన గడ్డి పోశం(56) అనే వ్యక్తి పరంచా పై నుంచి కింద పడి గురువారం మృతి చెందాడు.

విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా చర్యలు

జగిత్యాలరూరల్, జూన్ 13 : విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్.ఈ సత్యనారాయణ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ 33బై కేవీ సబ్‌స్టేషన్ ను గురువారం ఎస్ఈ పరిశీలించారు. మే లో కరెంట్ ట్రి ప్ అంతరాయాలు ఎక్కువగా ఏర్పడడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈ మాట్లాడుతూ లైన్ల మీదుగా అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను మాత్రమే తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వినియోగదారులకు అంతరాయం కల గకుండా నాణ్యమైన విద్యుత్ ను అందించాలని చల్‌గల్ ఏఈ శ్రీధర్‌ను ఆదేశించారు. వర్షాకాలంలో వినియోగదారులు రైతులు, శువులు, మిగతా జంతువులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. టెక్నికల్ ఏడీ ఈ నగేష్‌కుమార్, ఏఇలు శ్రీధర్, శ్యామ్, నవీన్ జమీల్‌భాషా సుస్మిత జ్యోతి, సబ్ ఇంజనీర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

మల్యాల, జూన్ 13: సర్కారు బడుల్లో బోధించే క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని అవసరం మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మల్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు మంచి భవి ష్యత్తు ఉంటుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా గల 591 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.43.45కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక సదపాయాలు, తాగునీరు, విద్యుత్, పెద్ద, చిన్న తరహ మర్మత్తులు చేపట్టిన్నట్లు తెలిపారు. అలాగే మహిళ సంఘాల ద్వారా విద్యార్థులకు యూనిఫామ్ కుట్టించి అందించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రైవేట్‌కు దీటుగా బోధన చేస్తూ విద్యార్థులను ఉత్వములుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆగంతపు రవళి, ఆర్డీవో మధుసూధన్, జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి, డీఆర్డీవో సంపత్‌రావు, డీపీవో దేవరాజ్, ఎంపీడీవో స్వాతి, తహసీల్దార్ మునీందర్, ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

కోరుట్ల రూరల్ : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) రాంబాబు అన్నారు. గురువారం కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్‌లు, యూనిఫాంను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19వ తేదీవరకు రాష్ట్రంలో బడి బాట కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఆ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలో చదివే విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి అనంద్, జడ్పీటీసీ సభ్యురా లు దారిశెట్టి లావణ్య - రాజేష్, ఎంపీపీ తోట నారాయణ, మున్సిపల్ కమీషనర్ తిరుపతి, ఎంఈవో నరేశం, వార్డు కౌన్సిలర్ బద్ది సుజాత, మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మెన్ మోహన్ రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



మల్యాలలో పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు, ఎమ్మెల్యే

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని గణేష్‌పల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దాసరి భీమయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కటుకం భవాని విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు గురువారం పంపిణీ చేశారు. పాఠశాల ఆధ్వర్యంలో ఉదయం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు దాసరి భీమయ్య, ఉపాధ్యాయులు బడి ప్రవీణ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాయికల్: ప్రభుత్వ పాఠశాలలోనే ఒత్తిడి లేని మెరుగైన విద్య అందుతుందని రాయికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాప శ్రీనివాస్ అన్నారు. గురువారం రాయికల్ పట్టణంలోని ఒడ్డెర కాలనీ, చెర్లకొండా పూర్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, మహేశ్వర శర్మ, ప్రశాంత్, పద్మ, తరంగిణి, రజిత పాల్గొన్నారు.

బీర్‌పూర్: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేష్ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలోని బాల బాలికల తల్లి దండ్రులు ప్రభుత్వ పాఠశాలలలో అందిస్తున్న విద్యపై ఆలోచించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ఏవిధంగా ఉంటుందో చెప్పడానికి 2024ఫలితాల్లో పదవ తరగతిలో 9.8 సాధించిన నందిని ఒక్క ఉదహరణ అని అన్నారు. అనంతరం 10వ తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు గౌరవాన్ని తెచ్చిన నందినిని ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు శాలువ కప్పి సన్మానించారు. పేద విద్యార్థిని అయిన నందిని కర్చుల నిమిత్తం పాఠశాల సిబ్బంది 5116 రూపాయలను అందించారు. జిల్లా కేడీసీసీ మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, ఐకేపీ ఏపీడీ చరన్ తేజ, డీపీఎం వెంకటేశం, జెడ్పీటీసీ పాత పద్మ రమేష్, ఎంపీడీవో లచ్చాలు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూర్తి, ఎంపీవో రామకృష్ణ రాజ్, సూపరిండెంట్ రాజమౌ ళి, రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాస్, పాఠశాల చైర్మన్ శ్రీలత పాల్గొన్నారు.

బుగ్గారం: నాణ్యమైన విద్యను అందించే సర్కారు బడులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలిన బుగ్గారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు, యూనిఫాంలు పంపిణీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మనూష, సీఆర్పీ పురుషోత్తం, ఉపాధ్యాయులు రవి ప్రసాద్, లచ్చయ్య, శ్రీనివాస్, జయప్రద, అశోక్, సతీష్ పాల్గొన్నారు.